క్లుప్తంగా

ప్రధాన డ్రైనేజీ పరిశీలన


డ్రైనేజీని పరిశీలిస్తున్న కమిషనర్ అరుణశ్రీ

సాక్షి స్పందన

రామగుండం: పట్టణంలోని శిథిలావస్థకు చేరిన ప్రధాన డ్రైనేజీ దుస్థితిని గురువారం కార్పొరేషన్ ఇన్‌చార్జి కమిషనర్ అరుణశ్రీ, సంబంధిత అధికారులు పరిశీలించారు. ఇటీవల 'సాక్షి' దినపత్రికలో వరుసగా ప్రచురితమైన కథనాలపై వారు స్పందించి డ్రైనేజీని పరిశీలించారు. డ్రైనేజీ మరింత శిథిలావస్థకు చేరి మురుగు నీరు ప్రధాన రహదారిపై పారుతుండడతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాగా రాబోయే వర్షాకాలం దృష్ట్యా త్వరగా నూతన డ్రైనేజీ నిర్మించాలని పట్టణ ప్రజలు కమీషనర్‌కు విన్నవించారు.

దేశవ్యాప్త సమ్మె విజయవంతం చేయండి


బుక్‌లెట్ ఆవిష్కరిస్తున్న ముత్యంరావు

మంథని: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 20న నిర్వహించే దేశవ్యాప్త సమ్మె విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు కోరారు. మంథని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో గురువారం సమ్మెకు సంబంధించిన బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలన్నారు. సమ్మెలో మంథని ప్రాంతం నుంచి ఉద్యోగ, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని పిలుపునిచ్చారు. జిల్లా కమిటీ సభ్యుడు బూడిద గణేశ్ ఉన్నారు.

లేబర్‌కోడ్‌లు రద్దు చేయాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు

పెద్దపల్లిరూరల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాసేలా అమలుకు యత్నిస్తున్న నాలుగు లేబర్‌కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ అనుబంధ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు భిక్షపతి, జిల్లా యూనియన్ అధ్యక్షుడు వాగు నాయక్ డిమాండ్ చేశారు. పెద్దపల్లిలోని సీఐటీయూ ఆఫీసులో గురువారం దేశవ్యాప్త సమ్మె కరపత్రాలు, పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు, ఉద్యోగులు పాల్గొనాలని కోరారు. నాయకులు సీపెల్లి రవీందర్, నర్సయ్య, కొండయ్య, జ్యోతి పాల్గొన్నారు.

కూలీల సమస్యల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న మనాలిఠాకూర్

పాలకుర్తి: ఉపాధిహామీ కూలీల సమస్యలను ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని మక్కాన్‌సింగ్ సేవాసమితి అధ్యక్షురాలు మనాలి ఠాకూర్ అన్నారు. మండలంలోని కుక్కలగూడూర్ గ్రామ శివారులో గురువారం ఉపాధిహామీ పనులు నిర్వహిస్తున్న కూలీలతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వేసవిదృష్ట్యా పని చేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న గ్రామ మాజీ సర్పంచ్ శ్రీపతి శంకరయ్యను ఆమె పరామర్శించారు.

మేడిపల్లిలో ఉచిత వైద్య శిబిరం

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ మూడో డివిజన్ మేడిపల్లిలో కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మెడికవర్ ఆస్పత్రి జనరల్ ఫిజీషియన్ డాక్టర్ నాగరాజు, డీఎంవో డాక్టర్ హర్షిత్ షుగర్, బీపీ, 2డి ఎకో పరీక్షలు చేశారు. మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, కాంగ్రెస్ ఎన్టీపీసీ పట్టణ కమిటీ అధ్యక్షుడు ఆసిఫ్ పాషా, యూత్ కాంగ్రెస్ నాయకులు ఎం.రమేశ్, మేరుగు అభిషేక్, మూడో డివిజన్ ప్రెసిడెంట్ లంబు కిషన్‌రెడ్డి, రాజేశం, ఆంజనేయులు, సలీం, నరసింహారెడ్డి, ఆసుపత్రి మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, హరీశ్, యూనస్ పాల్గొన్నారు.

ఇరవై రోజులైనా కానరాని చర్యలు

- అక్బర్‌నగర్ కాలనీలో ప్రాతిపదికన చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై నిర్లక్ష్యం
- శాశ్వత రక్షణ చర్యలు చేపట్టాలని బాధితుల వినతి


బూడిద పైపులైన్ల పక్కనున్న నివాసాలు

రామగుండం: ఇరవై రోజుల క్రితం ఎన్టీపీసీ బూడిద పైపు పగిలి సమీపంలోని అక్బర్‌నగర్ కాలనీలోని పలు గృహాలు, కాలనీలు బూడిదతో ముంచెత్తిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో పలు గృహాలు బూడిదతో నిండిపోగా మరుసటి రోజు ఎన్టీపీసీ యాజమాన్యం స్పందించి పలువురికి కొంతమేర ఆర్థికసాయం అందజేసింది. కాగా నష్టపోయిన మొత్తానికి పరిహారం అందజేయాలని బాధిత కుటుంబాలు కోరడంతో పాటు శాశ్వత ప్రాతిపదికన చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులను ఉన్నతాధికారుల సమక్షంలో ఎన్టీపీసీ అధికారులకు నివేదించారు. దీనిపై ఎన్టీపీసీ సీఎస్ఆర్ అధికారులు స్పందించి తక్షణమే పునరుద్ధరణ పనులు చేపడతామని హామీ ఇచ్చారు. కానీ ఇప్పటికీ ఎలాంటి చర్యలు చేపట్టలేదు.

ఎన్టీపీసీ చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై నివేదికలో పేర్కొన్న అంశాలు..

- బూడిదతో నిండిపోయిన వారికి పక్కా గృహాలు నిర్మించాలని, నష్టపోయిన వస్తువులు, సామగ్రికి వందశాతం పరిహారం చెల్లించాలి.
- బూడిద పైపులైన్ పక్క నుంచి రిటైనింగ్ వాల్ నిర్మించి గృహాలకు రక్షణ కల్పించాలి.
- అక్బర్‌నగర్‌లోని యువతకు ఉద్యోగావకాశాలు, ఇంటింటికీ శుద్ధి జలాలు అందించాలి.
- ఎన్టీపీసీ ఉద్యోగులకు అందించే హెల్త్‌కార్డు అందించాలి. అంబులెన్స్ ఏర్పాటు చేయాలి.
- అక్బర్‌నగర్‌లో భూగర్భ డ్రైనేజీ, సీసీరోడ్ల నిర్మాణం చేపట్టాలి.
- ఏటా ఎండాకాలంలో యాష్‌పాండ్ నుంచి ఈదురుగాలులతో బూడిద లేవకుండా స్ప్రింక్లింగ్ ఏర్పాటు చేయాలి.

శాశ్వత రక్షణ చర్యలు చేపట్టాలి..

ఎన్టీపీసీ బూడిద పైపులు పగిలి గతంలో పలు ఘటనలు చోటు చేసుకున్నాయి. ఏడేళ్ల క్రితం ఇటీవల జరిగిన స్థలంలోనే బూడిద పైపు పగిలి మిర్యాల గణపతి నివాస గృహంతో పాటు మరిన్ని గృహాలు బూడిదతో ముంచెత్తాయి. అదేవిధంగా మల్యాలపల్లి గ్రామ సమీపంలో కుందనపల్లికి చెందిన ఎనగంటి వెంకటేషం పంట పొలం మరో రెండు రోజుల్లో కోసేందుకు సిద్ధం అవుతుండగా బూడిద పైపు పగిలి రెండెకరాల పొలంలో మీటర్ ఎత్తు వరకు బూడిదతో నిండిపోయింది. దీంతో సదరు రైతు భూమిలో సారం దెబ్బతిని నాణ్యమైన పంటరాక ఆర్థికంగా నష్టపోతున్నాడు. ఎన్టీపీసీ అధికారులు శాశ్వత రక్షణ చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

పనులు ప్రారంభించలేదు



గత నెల 23న బూడిద పైపు పగిలి మా అమ్మ వాళ్ల ఇల్లు పూర్తిగా బూడిదతో నిండిపోయింది. ఆ సమయంలో తాత్కాలిక పరిహారం అందజేసినా ఇంట్లోని పలు సామగ్రి పనికి రాకుండా పోయాయి. త్వరలోనే శాశ్వత పరిష్కారం చూపిస్తామని చెప్పిన అధికారులు ఇప్పటికీ పనులు ప్రారంభించలేదు. – సజ్జు, అక్బర్‌నగర్

నివేదిక అందజేశాం



బూడిద పైపులైన్ పక్కన వీధిలోనే నా ఇల్లు ఉంటుంది. ఆ సమయంలో కాలనీవాసులు, బాధితులు చేపట్టాల్సిన అభివృద్ధి పనుల విషయమై ఎన్టీపీసీ అధికారులకు నివేదిక అందజేశాం. ఆ పనులన్నీ ఎమ్మెల్యే సహకారంతో పూర్తి చేయిస్తాను. బాధిత కాలనీవాసులు ఆందోళన పడొద్దు. – నాజియాసుల్తానా, స్థానికురాలు, కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు

త్వరలోనే సమావేశం

అక్బర్‌నగర్‌లో బూడిద పైపులైన్ పగిలి పలు ఇళ్లలో బూడిద ముంచెత్తగా శాశ్వత ప్రాతిపదికన చేపట్టాల్సిన అభివృద్ధి పనుల విషయమై త్వరలోనే ప్రత్యేకంగా ఉన్నతాధికారులతో సమావేశం ఉంది. ఆ తర్వాత చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై స్పష్టత వస్తుంది. – సబ్బూనాయక్, ఎన్టీపీసీ సీఎస్ఆర్ అధికారి

నిబంధనల మేరకు అర్హుల ఎంపిక


డంపింగ్‌యార్డ్ స్థల పరిశీలనలో కలెక్టర్ శ్రీహర్ష

సుల్తానాబాద్: నిబంధనల మేరకు రాజీవ్ యువ వికాసం లబ్ధిదారులను ఎంపిక చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించారు. పట్టణ సమీపంలోని డంపింగ్ యార్డు స్థలాన్ని పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ రమాదేవి, ఎంపీడీవో దివ్య దర్శన్‌రావు, మున్సిపల్ కమిషనర్ నియాజ్, అధికారులు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

ఎలిగేడు: రాష్ట్ర ప్రభుత్వం తీసుకవచ్చిన భూభారతిలో భాగంగా మండలంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ కోయశ్రీహర్ష అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం ఆయన సందర్శించి, రెవెన్యూ సదస్సుల నిర్వహణపై అధికారులతో రివ్యూ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను త్వరగా ఫీల్డ్ విచారణ పూర్తి చేసి పరిష్కరించాలని ఆదేశించారు. వచ్చిన దరఖాస్తుల్లో విచారణ పూర్తయిన వాటిని వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ప్రతీ దరఖాస్తుకు సంబంధిత నోటీసులు జారీ చేయాలన్నారు. పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య, తహసీల్దార్ యాకన్న, డిప్యూటీ తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఆర్ఐలు చంద్రశేఖర్, జయలక్ష్మి, సంబంధిత అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిషేధిత మందులు విక్రయించొద్దు


నూతన కమిటీని అభినందిస్తున్న జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వినోద్, రాజేందర్

మంథని: ప్రభుత్వం నిషేధించిన మందులను ఎట్టి పరిస్థితుల్లో విక్రయించొద్దని, నకిలీ మందుల విషయంలో జాగ్రత్త వహించాలని కెమిస్టు, డ్రగ్గిస్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాడూరి వినోద్‌కుమార్ సూచించారు. మంథనిలో నిర్వహించిన మండల స్థాయి కెమిస్టు, డ్రగ్గిస్టు అసోసియేషన్ ఎన్నికల సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్ని కంపెనీల మోసాలు గుర్తించాలని, నమ్మకమైన డీలర్ల వద్దే మందులు కొనుగోలు చేయాలన్నారు. అనంతరం మంథని మండల కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షుడిగా క్యాతం కుమార్ రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా నూక శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా చింతపండు రాజు, కోశాధికారిగా కనుకుంట్ల పురుషోత్తం, అడిషనల్ సెక్రటరీగా ఆరె కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ అరకాల కోటేశ్వర్, సలహాదారుగా ఎం.శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేందర్, కోశాధికారి పోలు సతీశ్, డాక్టర్ భాస్కర్, మెడికల్ దుకాణాల యజమానులు జేఎస్.రెడ్డి, ఇల్లందుల రాము, ముత్తారం, రామగిరి, కమాన్‌పూర్ మండలాల కెమిస్ట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, జిల్లా యూనియన్ బాధ్యులు పాల్గొన్నారు.

సింగరేణి పరిరక్షణ కోసం టోకెన్ సమ్మె


మాట్లాడుతున్న సింగరేణి జేఏసీ నాయకులు

రామగిరి: సింగరేణిలో కొత్త గనుల కోసం, సంస్థ పరిరక్షణ కోసం, నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు కోసం, కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని 20న సింగరేణిలో ఒకరోజు టోకెన్ సమ్మె చేపట్టినట్లు సింగరేణి జేఏసీ నాయకులు తెలిపారు. ఆర్జీ–3 పరిధిలోని ఓసీపీ–2లో గురువారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ, టీబీజీకేఎస్ సంఘాల నాయకులు సారయ్య, ఎం.రామచంద్రారెడ్డి, కోట రవీందర్‌రెడ్డి, ముత్యంరావు, మిర్యాల రాజిరెడ్డి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను ఈ నెల 20న దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు టోకెన్ సమ్మెకు పిలుపునిచ్చాయన్నారు. సమ్మె విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. జేఏసీ నాయకులు గంగాధర్, వెంకటస్వామి, పోశం పాల్గొన్నారు.

మున్సిపల్ యూనియన్ నేత లింగయ్య మృతి


లింగయ్య మృతదేహం దగ్గర నివాళి అర్పిస్తున్న పలు యూనియన్ల ప్రతినిధులు

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థలో 25 ఏళ్లుగా మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, పర్మినెంట్ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్న మంథెని లింగయ్య(74) గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. గోదావరిఖని అంబేడ్కర్‌నగర్‌లోని వారి నివాసంలో లింగయ్య మృతదేహాన్ని చూసేందుకు మున్సిపల్ కార్మికులతోపాటు వివిధ పార్టీలు, కార్మిక సంఘాల నాయకులు, ప్రతినిధులు తరలివచ్చారు. పూలమాల వేసి నివాళి అర్పించారు. మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీ నాయకులు నడిపెల్లి మురళీధర్ రావు, వై.యాకయ్య, సీనియర్ హైకోర్టు అడ్వకేట్ గొర్రె రమేశ్, కందుల సంధ్యారాణి, మామిడిపెల్లి బాపయ్య, బొంకూరి మధు, కోటగిరి పాపయ్య, నాతరి రాయమల్లు, ధర్మేందర్, రాజనర్సయ్య, దుర్గయ్య పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని కుందనపల్లి రాజీవ్ రహదారి భారత్ పెట్రోల్ పంప్ సమీపంలో గురువారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులకు తీవ్ర గాయాలైనట్లు ఎస్సై వెంకటస్వామి తెలిపారు. రాజీవ్ రహదారి పక్కన ఆగి ఉన్న లారీని డీసీఎం ఢీకొనడంతో పలువురు గాయాలపాలయ్యారు. ఈ ఘటనలో గాయపడిన ఆసిస్, నరేన్, వికాస్‌లు ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వారుగా గుర్తించారు. గాయపడిన వారి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. కాగా వారు శుక్రవారం వరకు అంతర్గాం చేరుకోనున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

• ప్రచార సంస్థ బాధ్యత వహించాలి

మంథని: సరస్వతీ నది పుష్కరాల సందర్భంగా కాళేశ్వరంలో ఏర్పాటు చేసిన కటౌట్లలో ఏదైనా పొరపాటు జరిగితే ఆ బాధ్యత వాటిని ఏర్పాటు చేసిన ప్రచార సంస్థదేనని టీపీసీసీ ఎన్నికల కమిటీ సభ్యుడు శశిభూషణ్ కాచే అన్నారు. ప్రచార సంస్థ ఏర్పాటు చేసిన కటౌట్‌లో పొరపాటు ప్రభుత్వ పెద్దలది కాదన్నారు.

• అధికారులపై చర్య తీసుకోవాలి

గోదావరిఖని: సరస్వతి పుష్కరాల్లో ప్రోటోకాల్ పాటించకుండా ఫ్లెక్సీలో ఫొటో ముద్రించకుండా పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణను అవమానించిన దేవాదాయశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని సీనియర్ కాంగ్రెస్ నాయకులు పి.మల్లికార్జున్ ఒకప్రకటనలో డిమాండ్ చేశారు. దళిత ఎంపీపై వివక్ష చూపుతున్న దేవాదాయశాఖతో పాటు ఇతర శాఖల ఆఫీసర్లపై కూడా చర్యలు తీసుకోవాలని, ఈ విషయంలో పార్లమెంట్ ప్రోటోకాల్ విభాగం జోక్యం చేసుకోవాలని కోరారు.

రైతులకు అవగాహన


మాట్లాడుతున్న వ్యవసాయాధికారి అనూష

ముత్తారం: ముత్తారం రైతువేదిక కార్యాలయంలో మండల వ్యవసాయశాఖ అధికారులు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి అనూష మాట్లాడుతూ ప్రతీ పౌరుడికి ఆధార్ గుర్తింపు ఉన్నట్లుగానే ప్రతీ రైతుకు ఒక విశిష్టమైన 11 అంకెల యూనిక్ ఐడీ నంబర్ ఉండాలని, కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని డిజిటలైజేషన్ చేయడానికి ఈ ప్రాజెక్టు తీసుకువచ్చిందని వివరించారు. భూమి ఉన్న ప్రతీ రైతు భూములకు సంబంధించిన వివరాలతో ఫార్మర్ రిజిస్ట్రీ చేయాలని సూచించారు.

నగరంలో అభివృద్ధి పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న కమిషనర్ అరుణశ్రీ

కోల్‌సిటీ: నగరంలోని వివిధ ప్రాంతాలను రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్ఏసీ), అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) జె.అరుణశ్రీ గురువారం సందర్శించారు. పలు సమస్యలు, అభివృద్ధి పనులను పరిశీలించారు. స్థానిక మల్కాపూర్‌లోని సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్(ఎస్టీపీ) నిర్మాణ పనులను పరిశీలించారు. అవసరానికి తగ్గట్లుగా అప్‌గ్రేడ్ చేయడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామన్, పబ్లిక్‌హెల్త్, ఇంజనీరింగ్ విభాగం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దేవేందర్, ఏఈ మౌనిక, నగరపాలక సంస్థ శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిరణ్ ఉన్నారు.



పాలకుర్తి: మండలంలోని జీడీనగర్ గ్రామంలో డ్రైనేజీల సైడ్‌వాల్స్ కూలిపోవడంతో కాలువల్లో మురుగునీరు నిలుస్తోంది. దీంతో దుర్వాసనతో పాటు దోమలు వృద్ధి చెంది రోగాలబారిన పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై గ్రామ పంచాయతీ సిబ్బందికి ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

రైల్వేస్టేషన్ పనుల పరిశీలన


పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి రైల్వేస్టేషన్‌ను సందర్శిస్తున్న డీఆర్‌ఎం

పెద్దపల్లిరూరల్: సికింద్రాబాద్ (సౌత్ సెంట్రల్ రైల్వే) డివిజన్ రైల్వే మేనేజర్ భారతీష్ కుమార్ జైన్ పెద్దపల్లి రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులు పనుల పురోగతి తదితర విషయాలను డీఆర్‌ఎంకు వివరించారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపండి..

పెద్దపల్లి రైల్వే జంక్షన్‌లో ఈ ప్రాంత ప్రయాణికుల కోసం పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపేలా చూడాలని డీఆర్‌యూసీసీ సభ్యుడు నారాయణదాస్ తివారీ, ఉత్తర తెలంగాణ రైల్వేఫోరం ఉపాధ్యక్షుడు అజయ్‌క్రాంతిసింగ్, దేవిసింగ్ ఠాకూర్ తదితరులు డీఆర్‌ఎంకు విన్నవించారు. తెలంగాణ సూపర్ ఫాస్ట్, త్రివేండ్రం స్వర్ణజయంతి వీక్లీ, ఎర్నాకులం మిలినీయం వీక్లీ, వైన్‌గంగా బైవీక్లీ, చెన్నై సెంట్రల్ నుంచి భగత్‌కీకోటి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలపాలని కోరారు. బల్లార్షా–కాజీపేట రైలును చర్లపల్లి వరకు, తిరుపతి నుంచి కరీంనగర్ బైవీక్లీ రైలును నిజామాబాద్ వరకు పొడిగించాలని విన్నవించారు. పెద్దపల్లి కొత్తబైపాస్ లైన్ వద్ద కొత్త రైల్వేస్టేషన్ నిర్మించేలా చర్యలు తీసుకోవాలని డీఆర్‌ఎంకు వినతిపత్రాలు అందించారు.

రామగుండం రైల్వేస్టేషన్‌లో..

రామగుండం: దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజన్ రైల్వే మేనేజర్ భరతేష్ కుమార్ జైన్ గురువారం రామగుండం రైల్వేస్టేషన్‌ను సందర్శించారు. రైల్వేస్టేషన్‌లో చేపడుతున్న ఆధునీకీకరణ పనులతో పాటు శాఖపరమైన అంశాలను పరిశీలించారు. డీఆర్‌యూసీసీ ప్రతినిధి అనుమాస శ్రీనివాస్ నేతృత్వంలో స్థానిక కుందనపల్లి నాయకులు ఇఫ్తాకార్ అహ్మద్, తంబాడి శంకర్ డీఆర్‌ఎంను కలిసి కుందనపల్లి రైల్వే గేటు వద్ద ఫ్లై ఓవర్ వంతెన, భూగర్భ వంతెన నిర్మించాలని వినతిపత్రం అందజేశారు. స్పందించిన డీఆర్‌ఎం అప్పటికప్పుడు సంబంధిత అధికారితో ఫోన్‌లో మాట్లాడగా టెండర్ ప్రక్రియలో ఉందని, ఏడాదిన్నరలోగా వంతెన నిర్మాణం పూర్తికానుందని సమాధానమిచ్చినట్లు డీఆర్‌ఎం పేర్కొన్నారు. అనంతరం వివిధ సమస్యలపై ద.మ.రైల్వే ఎంప్లాయీస్ సంఘ్, సీఐటీయూ ప్రతినిధులు పలు సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు.

ధాన్యం కొనుగోళ్లలో జాప్యమెందుకు?


ధాన్యాన్ని పరిశీలిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

పెద్దపల్లిరూరల్: రైతులు పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు అమ్ముకుందామని కొనుగోలు కేంద్రాలకు వస్తే తూకం వేయడంలో జాప్యం చేస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి అన్నారు. పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌యార్డును గురువారం సందర్శించారు. వర్షానికి తడిసిన ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు ఠాకూర్ రాంసింగ్, జంగ చక్రధర్‌రెడ్డి, శ్రీనివాసరావు, పర్శ సమ్మయ్య, సదానందం, రవి, నరేశ్, కొమురయ్య ఉన్నారు.

తడిసిన ధాన్యాన్ని బేషరతుగా కొనాల్సిందే

పెద్దపల్లిరూరల్: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని బేషరతుగా కొనుగోలు చేయాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్ వర్గీయులు మేకల శ్రీనివాస్, తంగెడ రాజేశ్వర్‌రావు, తిరుపతి, ఉమేశ్, శ్రావణ్, రంగస్వామి, మల్లేశం, ఊషాలు, సమ్మయ్య డిమాండ్ చేశారు. నిబంధనల పేరిట రైతులను ఇబ్బందులకు గురిచేస్తే ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసును ముట్టడించడంతో పాటు ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని బేషరతుగా కొనాలన్నారు.

17న 'ఖని'లో అండర్–25 క్రికెట్ సెలక్షన్స్

గోదావరిఖనిటౌన్: ఉమ్మడి క్రికెట్ కరీంనగర్ జిల్లా సంఘం (కేడీసీఏ) ఆధ్వర్యంలో అండర్–25 క్రికెట్ సెలక్షన్స్ జిల్లావ్యాప్తంగా నిర్వహించనున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు వి.ఆగంరావు, ఎన్.మురళీధర్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17న జిల్లాలోని పెద్దపల్లి, రామగుండం, మంథని మూడు నియోజకవర్గాలకు చెందిన క్రీడాకారులు గోదావరిఖనిలోని జీఎం కాలనీ గ్రౌండ్‌లో శనివారం ఉదయం 9గంటల నుంచి సెలక్షన్స్ ప్రారంభించనున్నట్లు జిల్లా ఇన్‌చార్జి డి.కిరణ్‌కుమార్ తెలిపారు. క్రీడాకారులు 01.09.2000వ సంవత్సరంలో జన్మించిన వారు అర్హులని వివరించారు. సెలక్షన్స్‌లో పాల్గొనే క్రీడాకారులు సొంత కిట్, తెల్ల దుస్తులు ధరించాలని సూచించారు. క్రీడాకారులు తమ వెంట పాస్‌పోర్ట్ సైజు ఫొటో, పుట్టిన తేదీ ఒరిజినల్ సర్టిఫికెట్, ఎస్ఎస్‌సీ, ఇంటర్ మెమో, కరెంట్ ఇయర్ స్టడీ, బోనోఫైడ్, ఆధార్, పాన్ కార్డు ఒరిజినల్స్ తీసుకురావాలన్నారు. సీనియర్ ఎన్ఐఎస్ కోచ్ ఎం.సుదేష్ కుమార్ ఆధ్వర్యంలో సెలక్షన్స్ జరగనున్నట్లు ఇన్‌చార్జి డి.అరుణ్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. వివరాలకు 98663 51620 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

గొర్రెల కాపరికి ఎమ్మెల్యే పరామర్శ

ఓదెల: మండలంలోని మడక గ్రామానికి చెందిన రాజకొమురయ్యకు చెందిన గొర్రెలు విద్యుత్‌ఘాతానికి గురై మరణించాయి. కాగా గురువారం ఎమ్మెల్యే విజయరమణారావు రాజకొమురయ్యను పరామర్శించి రూ.21వేలు అందజేశారు. విద్యుత్ అధికారులతో మాట్లాడి సంఘటన వివరాలు తెలుసుకున్నారు.